ప్రజాశక్తి
ఆదివారం 12 మార్చి 2023
5
శ్రీ సత్యసాయి

'దేశానికి మోదాని ముప్పు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు

# ప్రచారానికి ఫుల్‌స్టాప్

- రేపు మండలి ఎన్నిక పోలింగ్
- పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు
- నేడు సామగ్రి పంపిణీ
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం : కలెక్టర్

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

మండలి ఎన్నికల ప్రచారాలకు శనివారం సాయంత్రంతో తెరపడింది. పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గానికి ఈనెల 13వ తేదీన పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో 48 గంటల ముందుగా ప్రచారాలకు తెరపడింది. ఫిబ్రవరి 28వ తేదీ నుంచి ప్రచారాలు మొదలయ్యాయి. అప్పటి నుంచి శనివారం వరకు ప్రచార హోరు కొనసాగింది. ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపితోపాటు పిడిఎఫ్ పోటీగా ప్రచారాలు సాగాయి. వైసిపి తరుపున ప్రచార బాధ్యతలను ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు చూడగా, టిడిపి తరుపున నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు బాధ్యత వహించారు. ఈ రెండు పార్టీలకు దీటుగా పిడిఎఫ్ పట్టభద్రుల అభ్యర్థి పోతుల నాగరాజు, ఉపాధ్యాయ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి తరుపున ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలతోపాటు, ప్రజా సంఘాలు పెద్దఎత్తున ప్రచారంలో పాల్గొన్నాయి. శనివారం ఆఖరి రోజు పెద్దఎత్తున ప్రదర్శనలు సైతం చేపట్టారు. ప్రచారాలు ముగియడంతో ఇక ఓటర్లను ఏ రకంగా ఆకట్టుకొచ్చునని అంతర్గత ఎత్తులు వేసేందుకు ప్రధాన పార్టీలు సిద్ధమవుతున్నాయి. ప్రధాన రాజకీయపార్టీలు ప్రలోభాలకు పావులు కదుపుతున్నారు. చివరి నిమిషంలో డబ్బు పంపిణీ చేసేందుకు ఎత్తులు వేసే పనిలో నిమగ్నమయ్యారు. ప్రధానంగా అధికార వైసిపి తరుపున ఆ బాధ్యతలను నియోజకవర్గ ఎమ్మెల్యేలు చూస్తున్నారు. పట్టభద్రులైన ఓటర్లు ఏ మేరకు వీటికి ఏ మేరకు లొంగుతారన్నదీ ప్రశ్నార్థకంగానే ఉండటం గమనార్హం.

**పట్టభద్రుల ఓటర్లు 43,310**

జిల్లాలో పట్టభద్రుల ఓటర్లు 43310, టీచర్స్ ఓటర్లు 3348 ఉన్నారని కలెక్టర్ తెలిపారు. గ్రాడ్యుయేట్స్‌కి పోలింగ్ కేంద్రాలు54, టీచర్స్ పోలింగ్ కేంద్రాలు 32 ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం నాడు పుట్టపర్తి చిన్నపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పోలింగ్ సామగ్రిని ఎన్నికల సిబ్బందికి అందజేస్తామన్నారు. అన్ని పోలింగ్ స్టేషన్లలో వెబ్ కాస్టింగ్ చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో పకడ్బందీగా ఎన్నికలు జరిగేందుకు అన్ని చర్యలూ చేపట్టామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐసి, డిఐఒ రవిశంకర్, టెక్నికల్ సిబ్బంది విజయ్ కుమార్, రవికృష్ణ పాల్గొన్నారు.

పట్టభద్రులకు సంబంధించి కొత్తగా వచ్చిన జెంబో బ్యాలెట్ బాక్స్‌ను చూపుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

**ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం**
**కలెక్టర్ బసంత్‌కుమార్**

**పుట్టపర్తి రూరల్ :** ఈ నెల 13వ తేదీన జరగనున్న శాసనమండలి ఎన్నికలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని కలెక్టర్ బసంత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం నాడు పుట్టపర్తిలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ బందాల ఎంపికకు నిర్దేశించిన ర్యాండ్ మైజేషన్ ప్రక్రియ పూర్తి అయ్యిందన్నారు. కడప, అనంతపురం, కర్నూలు పట్టభద్రులు, ఉపాధ్యాయుల శాసనమండలి ఎన్నికల్లో పట్టభద్రుల నుంచి 49 మంది అభ్యర్థులు, ఉపాధ్యాయుల నుంచి 12 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారన్నారు. ఈ ఎన్నికలకు సాధారణ ఎన్నికల్లో ఓటు వేసినట్లుగా కాకుండా, తమకు నచ్చిన అభ్యర్థులకు ప్రాధాన్యత క్రమంలో ఎంత మంది అభ్యర్థులు పోటీలో ఉంటే వారందరికీ కూడా వారి పేర్లకు ఎదురుగా 1,2,3,4 ఇలా అంకెలను బ్యాలెట్ పేపర్‌పై వేసే అవకాశం ఉంటుందన్నారు. ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో ప్రిసైడింగ్ అధికారి అందజేసే వైలెట్ పెన్నుతో మాత్రమే ప్రాధాన్యత క్రమంలో బ్యాలెట్ పేపర్‌పై అంకెలు వేసి బ్యాలెట్ పేపర్‌ను మడచి బాక్స్‌లో వేయాల్సి ఉంటుందన్నారు. ఓటర్ కేంద్రానికి ఓటర్ స్లిప్పుతో పాటు కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన ఓటర్ గుర్తింపు కార్డు, లేదా ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, పాన్ కార్డు, ఇండియన్ పాస్పోర్టు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థలు లేదా ఇతర ప్రయివేటు పారిశ్రామిక సంస్థలు వారి ఉద్యోగులకు జారీ చేసిన గుర్తింపు కార్డు, ఎంపీ, ఎమ్మెల్యేలకు ఎమ్మెల్సీలకు జారీ చేయబడిన అధికారిక గుర్తింపు కార్డులు, విశ్వవిద్యాలయం జారీ చేయబడిన డిగ్రీ లేదా డిప్లొమా ఒరిజినల్ సర్టిఫికెట్ పత్రాలను చూపించి ఓటు వేయాల్సి ఉంటుందన్నారు.

# దేశంపై అదానీ దాడి

## సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

ప్రధాని నరేంద్ర మోడీ మద్దతుతో దేశంలోని ప్రతి అంగుళం ఆక్రమించుకునేలా అదానీ దాడి చేస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ పేర్కొన్నారు. 'దేశానికి మోదాని ముప్పు' అన్న పుస్తకాన్ని శనివారం పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతకుముందు చరిత్రలో విదేశీ దురాక్రమాలను చూసామని, బిజెపి పాలనలో ఏకంగా స్వదేశీ దురాక్రమాలను చూస్తున్నామని తెలిపారు. దేశంలో ప్రతి అంగుళాన్ని మోడీ మద్దతుతో అదానీ తన సొంతం చేసుకోవడానికి దాడి చేస్తున్నాడని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణపట్నం పోర్టు, గంగవరం పోర్టులను సొంతం చేసుకోవడమే గాక విశాఖలో డేటా పేరుతో 400 ఎకరాలు అతి చౌకగా గుంజుకునే కుట్ర జరుగుతోందన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సోలార్ విద్యుత్ పేరుతో వేలాది ఎకరాలను అదానీకి కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆయుధ కర్మాగారం, పంప్డ్ స్టోరేజ్, హైడల్ విద్యుత్ ప్రాజెక్టులు పేరుతో గిరిజనుల ఉనికికే ప్రమాదంగా ముంచుకొస్తోందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రానికి కట్టబెట్టిన వైసిపి ప్రభుత్వం అదానీకి అడిగిందల్లా అప్పనంగా అందించడం దుర్మార్గమన్నారు. సంక్షేమ పథకాల ఆశచూపి రాష్ట్ర ప్రకతి సంపదలను అదానీ కొల్లగొడుతున్నా ప్రభుత్వం నోరు మెదపకపోవడం చూస్తే వారికి ఎంతలా సాగిలా పడుతున్నారో అర్థం అవుతోందన్నారు. రాష్ట్రం, దేశాన్ని ఎడాపెడా దోచుకుంటున్నా ఈ మోదానీ దోపిడీలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజలు, రాజకీయ పార్టీలు ఏకమైన ఆ దోపిడీని ఎదిరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్.వెంకటేష్, సిపిఎం, సిఐటియు నాయకులు పైపల్లి గంగాధర్, పెడపల్లి బాబా, గంగాద్రి పాల్గొన్నారు.

ఓటర్లను అభ్యర్థిస్తున్న సిపిఎం నాయకులు

# పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపిద్దాం..

**ప్రజాశక్తి-ధర్మవరం టౌన్**

పీడీఎఫ్ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిలను గెలిపించాలని కోరుతూ ధర్మవరం పట్టణంలో సిపిఎం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం నాడు ప్రచారం నిర్వహించారు. సుందరయ్య నగర్, దుర్గానగర్, పార్థసారధి నగర్‌లలో పట్టభద్రులు, ఉపాధ్యాయులను కలిసి ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం, కర్నూలు, కడప జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పి.నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిస్తే ప్రజా గొంతుకలుగా చట్ట సభల్లో ప్రజల పక్షాన ప్రభుత్వాలను ప్రశ్నిస్తారన్నారు. అంతేగాకుండా నిరుద్యోగులకు ఉపాధి, ప్రజా, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం, పరిశ్రమల ఏర్పాటు వంటి సమస్యలను మండలిలో నిలదీయాలంటే తప్పనిసరిగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జంగాలపల్లి పెద్దన్న, జెవివి నాయకులు డా॥ఆదిశేషు, రైతుసంఘం నాయకులు మారుతి, సిఐటియు నాయకులు ఎస్‌హెచ్.బాషా, ఆదినారాయణ, చేనేత కార్మిక సంఘం నాయకుడు వెంకటస్వామి, ఎస్ఎఫ్ఐ నాయకులు నాగార్జున పాల్గొన్నారు.

**లేపాక్షి :** పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కాంగ్రెస్ మండల కన్వీనర్ రామాంజనేయులు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్, ఎంజెపి గురుకుల పాఠశాల, జవహర్ నవోదయ విద్యాలయం, లేపాక్షి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశ్నించే వ్యక్తి లేకపోవడం వల్లే సిఎం జగన్ అభివృద్ధిని విస్మరించారన్నారు. కావున మండలిలో ప్రశ్నించే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ లేపాక్షి ఇన్‌ఛార్జి సద్రుఖాన్, కాంగ్రెస్ బి బ్లాక్ మండల ఉపాధ్యక్షులు గంగాధరప్ప, మండల ఉపాధ్యక్షులు బాబు, నాయకులు నారాయణస్వామి, అనంతకుమార్, ఆదినారాయణ, అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రా సరిహద్దులో చెక్‌పోస్టు

## ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్

**ప్రజాశక్తి-అమరాపురం**

ఆంధ్ర సరిహద్దు కర్ణాటకలో త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సరిహద్దులో చెక్‌పోస్టు ఏర్పాటు చేసి గట్టి నిఘా ఉంచుతామని ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కర్ణాటక రాష్ట్రంలోని హిరియూర్ పోలీస్ సబ్ ఇన్స్‌పెక్టర్ కాంతరాజు, అబ్బనహళ్లి పోలీస్ సబ్ ఇన్స్‌పెక్టర్ పరుశురాం, ఎక్సైజ్ శాఖ అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటకలో జరిగే ఎన్నికల్లో భాగంగా ఆంధ్ర సరిహద్దుల్లో ఎలాంటి అక్రమాలకు పాల్పడకుండా చూడాలన్నారు. శాంతియుతంగా ఎన్నికల నిర్వహించడానికి కలిసికట్టుగా గట్టి పోలీస్ బందోబస్తు నిర్వహించాలన్నారు. అదేవిధంగా అమరాపురం బార్ అండ్ రెస్టారెంట్ దగ్గర చెక్‌పోస్టు ఏర్పాటు చేస్తామన్నారు. బందోబస్తులో ఎలాంటి లోటుపాటి లేకుండా కలిసికట్టుగా ఉండామని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అప్రమత్తంగా విధులు నిర్వహించాలి:డీఎస్పీ

**హిందూపురం :** శాసన మండలి ఎన్నికల్లో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సిబ్బంది వారికి కేటాయించిన ప్రాంతాల్లో విధులు నిర్వర్ధించాలని ఇన్‌ఛార్జి డీఎస్పీ యశ్వంత్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం సాయంత్రం వన్‌టౌన్ స్టేషన్‌లో ఎన్నికల విధులకు హాజరైన అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఉల్లఘించినా అదపులోకి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐలు ఈరన్న, వెంకటేశ్వర్లు, పోలీసులు, పాల్గొన్నారు.

ఆర్‌కె ఫంక్షన్ హాల్ వద్ద వేచి ఉన్నా వైసిపి నేతలు

ప్రత్యేక వాహనంలో డబ్బులను తరలిస్తున్న అధికార పార్టీ నాయకులు

# 'పురం'లో ప్రజాస్వామ్యం అపహాస్యం..!

- మండలి ఎన్నికల్లో ఓటు కోసం అక్రమాలు
- వరదలై పారిన డబ్బు
- అధికార పార్టీ ఆర్‌కె ఫంక్షన్ హాల్.. టిడిపి ఎమ్మెల్యే నివాసం వద్ద డబ్బుల పంపిణీ.?

**ప్రజాశక్తి-హిందూపురం**

శాసన మండలి ఎన్నికల నేపథ్యంలో హిందూపురంలో ప్రజాస్వామ్యాన్ని అధికార, ప్రతిపక్ష పార్టీలు అపహస్యం చేస్తూ గత రెండు రోజుల నుంచి డబ్బును వరదలై పారిస్తోంది. అధికార పార్టీ వైసిపి నాయకులు ఆర్‌కె.ఫంక్షన్ హాల్ వద్ద డబ్బులు పంపిణీ చేస్తే, టిడిపి నాయకులు ఎమ్మెల్యే బాలకృష్ణ నివాసం వద్ద రహస్యంగ పంపిణీ చేశారు. పట్టభద్రులకు అధికార పార్టీ రూ.1000 ప్రతిపక్ష టిడిపి రూ.500 పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. ఇరు పార్టీలూ ఉపాధ్యాయులకు రూ.5000 ఇచ్చినట్లు సమచారం. టిడిపి వార్డు ఇన్‌ఛార్జుతో పంపిణీ చేయగా, అధికార పార్టీ డబ్బుల పంపిణీకి ఏకంగా అనంతపురం నుంచి ఓ ప్రత్యేక బృందాన్ని రప్పించి పంపిణీ చేశారు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో మండలి ఎన్నికలను అధికార వైసిపి ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ ఎన్నికల్లో సత్తా చాటితే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా గెలుపు మాదేనన్న సంకేతాలను ప్రజల్లో బలంగా పంపినట్లు అవుతుందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. ఇప్పటికే అన్ని మండలాల ఇన్‌ఛార్జులతో సమావేశం నిర్వహించి, ఎంత మంది ఓటర్లు ఉన్నారు.? అందులో తమ పార్టీ వారు ఎంత మంది ఉన్నారు.? మిగిలిన వారిని ఎలా ప్రశన్నం చేసుకోవాలి.? అన్న దానిపై చర్చించారు. శనివారం నాడు ఆర్‌కె ఫంక్షన్ హాల్ వద్ద వైసిపి నాయకులతో సమావేశం నిర్వహించారు. డబ్బుల పంపిణీ చేసే సమయంలో వార్డు కౌన్సిలర్లు, బూత్ కమిటీ కన్వీనర్ల మధ్య తేడా వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో డబ్బును తమ మనుషుల చేతనే పంపిణీ చేయిస్తామని ముఖ్య నేతలు చెప్పడంతో కౌన్సిలర్లు, బూత్ కన్వీనర్లు కంగుతిన్నారు. తెలుగుదేశం పార్టీ కూడా ఈ ఎన్నికల్లో గెలవాలని తమదైన శైలిలో ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. తమదైన శైలిలో డబ్బుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. హిందూపురంలోని ఎమ్మెల్యే బాలకృష్ణ నివాసం కేంద్రంగా నాయకులు నగదు పంచే ప్రయత్నాలు మొదలు పెట్టారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ సారి ప్రయివేటు పాఠశాల, కళాశాలల్లో పని చేసే ఉపాధ్యాయులు, ఆధ్యాపకులకు ఓటు హక్కు కల్పించింది. దీంతో పాటు ఆయా పాఠశాల, కళాశాలల యాజమాన్యలకు అందించి, వారి ద్వారా ఓటు హక్కు ఉన్నా ఉపాధ్యాయులకు అందించినట్లు వార్తలు వినపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఓటర్లు ఎలాంటి తీర్పును ఇస్తారన్న సందిగ్ధంలో అందరిలోనూ నెలకొంది.

# వలస ఓటర్లపై టిడిపి కన్ను

## బెంగళూరులో పట్టభద్రుల ఓటర్లతో సమావేశం

**ప్రజాశక్తి-మడకశిర**

కర్ణాటకకు వలస వెళ్లిన పట్టభద్ర ఓటర్లపై తెలుగుదేశం పార్టీ కన్నువేసింది. ఇందులో భాగంగా కర్ణాటక రాజధాని బెంగుళూరులోని నాగసంద్ర జెడిఎస్ కార్యాలయంలో వలస పట్టభద్ర ఓటర్లతో పెద్దఎత్తున ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అక్కడి ఎమ్మెల్యే మంజునాథ్‌తోపాటు ఆ రాష్ట్ర రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు కటకం శెట్టి ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తిప్పేస్వామి తదితరులు పాల్గొని ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 13న జరగనున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న టిడిపి అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సాధారణంగా సార్వత్రిక ఎన్నికల జరిగినప్పుడు వలస ఓటర్లను ఆకర్షించడానికి అభ్యర్థులు ప్రయత్నిస్తుంటారు. అయితే స్థానిక టిడిపి నేతలు మాత్రం ఒక అడుగు ముందుకేసి పట్టభద్రుల ఎన్నికల్లో సైతం వలస ఓటర్లను రాబట్టుకోవడానికి ప్రయత్నించడమే కాకుండా రాజధాని శాసనసభ్యుడైన మంజునాథ్‌తో కలిసి ప్రచారం నిర్వహించడం చూస్తే టిడిపి వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో అగలి జడ్పీటీసీ ఉమేష్ బెంగళూరు టిడిపి ఫోరమ్ యువకులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న కర్ణాటక ఎమ్మెల్యే మంజునాథ్

## ప్రజాశక్తి వార్తకు స్పందన

# ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం

**ప్రజాశక్తి-రొద్దం**

మండల కేంద్రంలోని నెలకొన్న ట్రాఫిక్ సమస్యను పోలీసులు ఎట్టకేలకూ శనివారం తొలగించారు. గత శనివారం వారపు సంత రోజున నెలకొన్న ట్రాఫిక్ సమస్యపై 'వాహనదారుల ఇక్కట్లు' అనే శీర్షికను ప్రజాశక్తిలో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన ఎస్తై నాగ స్వామి శనివారం పోలీసులు ఏర్పాటు చేసి రోడ్డుకు అడ్డంగా ఉంచిన వాహనాలకు అపరదా రుసుం విశించారు. దాదాపు 25 వాహనాలకు అపరాద విధించడంతోపాటు తర్వాత ఇలాగే కొనసాగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్ సమస్య తొలగించడంతో వాహనదారులు, దుకాణదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జమేదార్ కాంతప్ప, పోలీసులు దాదు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారుడిని హెచ్చరిస్తున్న పోలీసులు

ద్విచక్ర వాహనాలను అదుపు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి www.prajasakti.com


# పిడిఎఫ్ వైపు పట్టభద్రుల చూపు

పోతుల నాగరాజు,

కత్తి నరసింహారెడ్డి

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి జరుగుతున్న ఎన్నికల్లో శనివారంతో ప్రచారాల గడువు ముగిసింది. ఈ ఎన్నికల్లో జరిగిన ప్రచార సరళి, ఆ సమయంలో వస్తున్న ఆదరణ అంతా చూసినట్లయితే పట్టభద్రులు పిడిఎఫ్ (ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్) అభ్యర్థుల వైపు మొగ్గు చూపుతున్నట్టుగా స్పష్టమవుతోంది. ఈ ఎన్నికల్లో ప్రధానంగా వైసిపి, టిడిపి, పిడిఎఫ్ మధ్య త్రిముఖ పోరులా సాగుతున్నప్పటికీ అత్యధిక మంది ఓటర్లు పిడిఎఫ్ అభ్యర్థిగా బరిలో నిలిచిన పోతుల నాగరాజు వైపే మొగ్గు చూపుతున్నారన్నది రాజకీయ విశ్లేషకుల సైతం అంచనా వేస్తున్నారు.

సాధారణ ఎన్నికలకు భిన్నంగా మండలి ఎన్నికలు జరుగుతాయి. ఇక్కడ సాధారణ ఓటింగు లాగా కాకుండా దామాషా పద్ధతిలో ప్రాధాన్యతల ప్రకారం ఓటింగు చేసే వీలుంది. ఈ ఓటింగు ప్రక్రియలో జరుగుతున్న ఈ ఎన్నికల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పటి నుంచి పిడిఎఫ్ వైపు పట్టభద్రులు మొగ్గు చూపుతూ వస్తుండటం ఆనవాయితీ. ఈ ఎన్నికల్లో అత్యధికంగా పిడిఎఫ్ అభ్యర్థులే విజయం సాధిస్తూ వస్తుండటం గమనార్హం. ప్రొఫెసర్ నాగేశ్వర్, చుక్కా రామయ్య, ఎంవిఎస్.శర్మ, డి.రామిరెడ్డి, ఐ.బాలసుబ్రమణ్యం, కెస్.లక్ష్మణరావు, వై.శ్రీనివాసులరెడ్డి, ఐ.వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జి, డాక్టర్ గేయానంద్ ఇలాంటి ప్రముఖులందరూ ఈ జాబితాలోకి వస్తారు. 2007 ఎన్నికల్లోనూ పశ్చిమ రాయలసీమ నుంచి తొలిసారిగా పిడిఎఫ్ అభ్యర్థిగా గేయానంద్ గెలుపొందారు. ఈ ఎన్నికల్లో గెలుపొందేందుకు అప్పటి అధికారి పార్టీ అయిన కాంగ్రెసు అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి పెద్దఎత్తున డబ్బులు ఖర్చు పెట్టినా గెలుపొందలేకపోయారు. ఆ తరువాత 2013 ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేకత మూలంగా ఓటర్లు వైసిపి వైపు మొగ్గు చూపారు. అయితే అప్పుడు ఎన్నికైన ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి ప్రజా సమస్యలను పట్టించుకోలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న ఈ ఎన్నికల్లో వైసిపి తరపున మరోమారు వెన్నపూస గోపాల్ రెడ్డి తనయుడు వెన్నపూస రవీంద్రారెడ్డి బరిలో దిగినప్పటికీ పెద్దగా స్పందన కనిపించడం లేదన్నది రాజకీయవర్గాల్లో సాగుతున్న చర్చ.

**శాసనమండలికి వన్నె తెచ్చిన పిడిఎఫ్ ఎమ్మెల్సీలు**

పిడిఎఫ్ తరుపున గెలుపొందిన ఎమ్మెల్సీలు తమ నీతి, నిజాయతీతో శాసనమండలికే వన్నె తెచ్చారు. శాసనమండలి సభ్యులుగా వారికి లభించే వేతనాలు, అలవెన్సులను వారి సొంతానికి ఒక్క రూపాయి వాడుకోలేదు. వారికి వచ్చిన సొమ్మును ప్రజా ఉద్యమాలకే వెచ్చించి ఆదర్శంగా నిలిచారు. ప్రభుత్వం ఉచితంగా ఖరీదైన ఇళ్ల స్థలాలను కేటాయించినా వాటిని తిరస్కరించారు. ఒక రాజకీయ పార్టీ నుంచి ఎమ్మెల్సీగా గెలుపొంది అధికార పార్టీలోకి ఫిరాయించడం సర్వ సాధారణంగా మారిన ప్రస్తుత రోజుల్లో ప్రలోభాలకు లోనుకాకుండా నిజాయతీగా, పారదర్శకంగా వ్యవహరిస్తూ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఏదో ఒక రాజకీయ పార్టీ వైపు ఒరిగిపోకుండా విమర్శనాత్మకంగా ఉంటూ నిర్మాణాత్మక పాత్రను పోషిస్తున్నారు.

**విద్యావంతులకు స్థానమివ్వాలా..?**

శాసనమండలి పట్టభద్రులకు ఐదు స్థానాలే ఉన్నాయి. విద్యావంతుల వాణిని వినిపించడానికి ఇక్కడ నుంచే ఎన్నికైన ఎమ్మెల్సీకే అవకాశముంటుంది. ప్రధాన రాజకీయ పార్టీలు ఈ అవకాశాన్ని పట్టభద్రులకు ఇవ్వడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టభద్రుల స్థానంలో వైసిపి, టిడిపి తమ అభ్యర్థులను బరిలో దింపి వాటిని తమ ఖాతాల్లో వేసుకోవాలని చూస్తున్నాయి. ప్రధాన రాజకీయ పక్షాలు సర్పంచ్ నుంచి ఎంపీ వరకు తమ అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకుంటున్నాయి. వారు చేస్తున్న అభివృద్ధి, ప్రజా సమస్యలపై వారు స్పందిస్తున్న తీరు ఏమిటో అందరికీ తెలిసిందే. పైగా రాజయకీయ పార్టీల నుంచి ఎన్నికైన ప్రతినిధులకు పార్టీ అజెండా తప్ప స్వతంత్రంగా వ్యవహరించే అవకాశం ఉండదనేది వేరే చెప్పనక్కర్లేదు. అటువంటి పరిస్థితుల్లో ప్రజా సమస్యల విషయంలో స్వతంత్రంగా వ్యవహరిస్తున్న పిడిఎఫ్ అభ్యర్థుల వైపు యువత మొగ్గు చూపడం సహజమే. అందులో భాగంగానే పిడిఎఫ్ తరుపున నిలబడిన పోతుల నాగరాజు ప్రచారంలో ఆసక్తికరమైన స్పందన కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**ప్రశ్నించే గొంతుకగా పిడిఎఫ్**

శాసనమండలి లోపల, బయట ప్రశ్నించే గొంతుకలుగా పిడిఎఫ్ అభ్యర్థులుంటూ ఉన్నారు. గతంలో ఎమ్మెల్సీ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నుంచి ఎన్నికైన డాక్టర్ గేయానంద్ కూడా ఈ రకంగా రాయలసీమ సమస్యలపై మండలిలో పోరాటం చేయడమే కాకుండా కడప ఉక్కు కర్మాగారం కోసం దీక్షలు సైతం చేశారు. ఆ తరువాత ఈ ప్రాంత సమస్యలపై పోరాటం సాగిస్తున్నారు. ఇదే బాటలో పోతుల నాగరాజు కూడా రాయలసీమ ప్రాంతాభివృద్ధి, సమస్యలపై పోరాటాలు సాగించారు. ప్రధానంగా ఉపాధి, నీటి వనరులు, పరిశ్రమల ఏర్పాటుతోపాటు, ఉద్యోగ, కార్మిక సమస్యల పరిష్కారానికి చేసే కృషి గురించి ఓటర్లకు వివరించారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఇప్పటి వరకు ప్రజా సమస్యలపై సాగించే పోరాట ఒరవడినే కొనసాగించేందుకు పోతుల నాగరాజు సిద్ధంగా ఉన్నారన్న అభిప్రాయం పట్టభద్రుల ఓటర్లలోనూ స్పష్టంగా కనిపిస్తోంది. ఇదే వచ్చే మండలి ఎన్నికల్లో ఆయన వైపు పట్టభద్రులు మొగ్గుచూపుతున్నారడానికి నిదర్శనమని చెప్పవచ్చు.

## గరుడ వాహనంపై ఖాద్రీశుడు

**కదిరి అర్బన్ :** బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి శనివారం గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పలు రకాల పుష్ప అలంకరణ చేశారు. సాయంత్రం నరసింహ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి తిరువీధుల్లో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ప్రత్యేక నాదస్వర సంగీతాల మధ్య భక్తిగీతాలతో స్వామివారికి స్వాగతం పలుకుతూ తిరువీధుల్లో నరసింహ నామంతో మారుమోగాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా భారీ ఎత్తున తరలివస్తున్న భక్తులకు అన్నదానం కొనసాగిస్తున్నట్లు ఆలయ ఇఒ గురుప్రసాద్, పాలకమండలి ఛైర్మన్ గోపాలకృష్ణులు తెలిపారు. ఆలయంపై కళ్యాణ వేదికపైన కళాకారులు నాట్యాలతో భక్తులను ఆకట్టుకున్నారు.

## హజరత్ మస్తాన్‌వలీ ఉరుసు ప్రారంభం

**కొత్తచెరువు :** కొత్తచెరువులోని హజరత్ మస్తాన్‌వలి ఉరుసు మహోత్సవ వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు ఉరుసు జరగనుంది. ఇందులో భాగంగా దర్గాను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. తొలిరోజు శనివారం సాయంకాలం జియారత్తు రాత్రి 10 గంటలకు స్వామివారికి గంధం పూజ చేశారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ మేనేజర్ అతావుల్ రహిమాన్, వక్ఫ్‌బోర్డ్ జిల్లా వైస్ ఛైర్మన్ షాజహాన్, ముస్లింలు పాల్గొన్నారు.

## ఇష్టపడి చదవాలి : ఎంఇఒ

**హిందూపురం :** పదవ తరగతి విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే పదోతరగతిలో మంచి మార్కులు సాధిస్తారని ఎంఇఒ గంగప్ప సూచించారు. శనివారం స్థానిక పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 3 నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలంటే ప్రణాళికతో చదవాలన్నారు. పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పించి, క్రికెట్, టీవీ, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సామ్రాజ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం

సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి ఆనంద్‌బాబు

**హిందూపురం :** నులి పురుగుల నివారణతో చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యానికి నాంది పలుకుదామని వైద్యాధికారి ఆనంద్‌బాబు సూచించారు. నులిపురుగుల నివారణ దినోత్సవంపై శనివారం పట్టణంలోని జిల్లా ఆసుపత్రిలో ఉన్న మాత శిశు విభాగంలోని సెమినార్ హాల్‌లో పట్టణ వ్యాప్తంగా ఉన్న ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు తరాల పిల్లల ఆరోగ్యం కోసం ఈనెల 14. 18న నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పిపి యూనిట్ అధికారి డాక్టర్ పద్మజ, డా. ఆయిషా తస్నీం, సిఒలు వెంకటరమణ, శివన్న, సరస్వతి, ముస్తఫా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి పరీక్షలు

కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

**హిందూపురం :** పట్టణంలోని అల్ హి లాల్ పాఠశాల ఆవరణలో ట్రినిటి సర్వీసెస్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు డాక్టర్ కుమార్‌రాజ్ ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన శంకర్ కంటి అసుపత్రి సౌజన్యంతో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా 375 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 110 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో శంకర కంటి ఆసుపత్రి బృందం, డాక్టర్ అను, క్యాంపు ఇన్‌ఛార్జి శివప్రకాష్, సెక్రటరీ కె. ఉషా రాణి, జామీయ మసీదు ముతవల్లి నూరూల్లా, కమిటీ మెంబర్లు, వాలంటీర్ అధ్యక్షుడు షమీమ్, జాకీ తదితరులు పాల్గొన్నారు.

## పది పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలి

**ధర్మవరం టౌన్ :** త్వరలో జరగనున్న పది పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత శాతం సాధించేలా ప్రతి విద్యార్థి చదుకోవాలని ఇన్‌ఛార్జి డిఇఒ మీనాక్షి సూచించారు. ఈమేరకు శనివారం రాత్రి ధర్మవరంలో పదవ తరగతి విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి విద్యార్థులు ఎలా చదువుతున్న తీరుపై పరిశీలించారు. ఎలా చదువుతున్నారని ఆరాతీశారు. తల్లిదండ్రులు ప్రోత్సాహం అందించాలని తదితర వాటిపై విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా పరీక్షల సమయంలో ఆరోగ్యంగా ఉండాలని, తెల్లవారుజామున లేచి చదవాలని, టీవీలు, సెల్‌ఫోన్లు చూడవద్దని విద్యార్థులకు సూచించారు. ఆయన వెంట బీఎస్ఆర్ బాలుర ఉన్నతపాఠశాల హెచ్‌ఎం రాంప్రసాద్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ మీనాక్షి

# ఓటర్లకు సౌకర్యాలు కల్పించాలి

## సబ్ కలెక్టర్ కార్తీక్

హిందూపురంలో ఎంజిఎం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కార్తీక్

**ప్రజాశక్తి-హిందూపురం**

ఈనెల 13న జరగనున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, టీచర్ల ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సబ్ కలెక్టర్ కార్తీక్ స్థానిక అధికారులను ఆదేశించారు. శనివారం పట్టణంలోని ఎంజిఎం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుభద్రుల కోసం 6, ఉపాధ్యాయుల కోసం ఒక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ తహశీల్దార్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

**ధర్మవరం టౌన్ :** పట్టణంలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను వన్ టౌన్ సీఐ సుబ్రమణ్యం, ట్రాఫిక్ సీఐ వహీద్‌బాషా శనివారం తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల వద్ద బందోబస్తుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఇందులో భాగంగా సిపి కెమరాలు, గదుల్లో వెలుతురు, తదితర వాటిని పర్యవేక్షించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ సోమవారం జరిగే పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపడుతున్నామన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు తమ ఓటు ఎవరి ప్రలోభాలకు లొంగకుండా వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ రోజు ఎవరైనా గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**రొద్దం :** ఎమ్మెల్సీ ఎన్నికల నిమిత్తం మండలంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సబ్ కలెక్టర్ కార్తీక్ శనివారం పరిశీలించారు. ఇందులో భాగంగా కేంద్రంలో సౌకర్యాలను పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూసుకోవాలని తహశీల్దార్ అనంతాచారికి సూచించారు. ముఖ్యంగా నీరు, వైద్యం, షామినియాలు, విద్యుత్, ఓటర్స్‌కు క్యూలైన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఓ భరత్, ఎస్ఐ నాగస్వామి, వీఆర్‌ఏ నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

**తలుపుల :** మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను సెక్టార్ ఆఫీసర్ లోకేశ్వర్‌రెడ్డి, రూట్ ఆఫీసర్ కులచంద్రారెడ్డి శనివారం పరిశీలించారు. ఇందులో భాగంగా వెలుతురు, షామియానాలు, మరుగుదొడ్లు, నీటి సౌకర్యాలపై ఆరాతీశారు. ముఖ్యంగా ఎండ తీవ్రత ఎక్కువ ఉండడంతో షామియానాలు ఉండాలని, మంచినీటి సౌకర్యం కల్పించాలని సూచించారు.

**లేపాక్షి :** మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పెనుగొండ సబ్ కలెక్టర్ కార్తీక్ శనివారం పరిశీలించారు. ఇందులో భాగంగా పోలింగ్ కేంద్రంలో ఉండాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో మండలం వ్యవసాయాధికారిణి శ్రీలత, విఆర్ఒ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## అన్ని మతాలనూ సమానంగా ఆదరించాలి

**ప్రజాశక్తి-హిందూపురం**

దేశంలోని అన్ని మతాలనూ ప్రభుత్వాలు సమానంగా ఆదరించినప్పుడే అభివృద్ధి సాధ్యమని ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రదర్ గద్దపాటి విజయరాజు అన్నారు. శనివారం స్థానిక సిఅండ్ఐజి మిషన్ కాంపౌండ్ చర్చ్‌లో ఏర్పాటు ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ దేశంలో మతఛాందసవాదులు పేట్రేగిపోతున్నారన్నారు. ముఖ్యంగా క్రైస్తవ్యం, చర్చిలు, పాస్టర్లు, సువార్తికులపై దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అలాంటి చర్యలను అరికట్టి దోషులను కఠినంగా శిక్షించడంతోపాటు భారత రాజ్యాంగం దేశ పౌరులకు కల్పించిన మత స్వేచ్ఛను కాపాడాలన్నారు. అలాగే క్రైస్తవుల శ్మశాన వాటికలకు స్థలాలు, కమ్యూనిటీ హాళ్లను నిధులు విడుదల చేయాలన్నారు. అనంతరం యూత్ జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐసియఫ్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంటు బిషప్ జాకబ్ శామ్యూల్, చర్చ్ సెక్రటరీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.నాగేంద్రకుమార్, పాస్టర్ ఫెలోషిప్స్ ప్రెసిడెంట్లు యన్ డేవిడ్, ఎస్.సూర్యప్రకాష్, పాస్టర్ స్టీఫెన్‌రాజ్, కోశాధికారి ఆదర్శ్‌కుమార్, సంఘ డీకెన్లు ఆనంద్‌రాజ్, క్రిస్టఫర్, జాన్సన్, జార్జ్ బాబు, లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, ఎంఆర్‌పిఎస్ ఆంజనేయులు, పాస్టర్ జయరాజ్, మింటూ మనోజ్, డ్యానీ, యూత్ కమిటీ సభ్యులు, తదితర నాయకులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఎమ్మెల్సీ ఎన్నికలు : ఎస్పీ

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్

**ప్రజాశక్తి-అమరాపురం**

పకడ్బందీగా పశ్చిమ రాయలసీమ ఎన్నికల బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ తెలిపారు. ఈమేరకు శనివారం మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అలాగే పక్కాగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ డీఎస్పీ హుస్సేన్ పీరా, మడకశిర సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సురేష్‌బాబు, ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌కు ఓటు అడిగే హక్కు లేదు : గుండుమల

విలేకరులతో మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి

**ప్రజాశక్తి-మడకశిర**

మేధావులు ఉండే పెద్దల సభ శాసనమండలిని రద్దు చేసేందుకు అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి సిఫార్సు చేసిన సిఎం జగన్‌కు ఓటు అడిగే నైతిక హక్కు లేదని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి అన్నారు. శనివారం పట్టణంలోని బాలాజీనగర్‌లో ఉన్న టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి కేవలం రాజకీయ నిరుద్యోగులకు అవకాశాలు కల్పించేందుకే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తోందని విమర్శించారు. ఇలాంటి స్వార్థ ప్రయోజనాల కోసం పోటీ చేస్తున్న వారికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా దొంగ ఓట్లతో గెలవడానికి అధికార పార్టీ ప్రయత్నిస్తోందని ఎన్ని ప్రయత్నాలు చేసినా గెలిచేది ప్రజాస్వామ్యమే అన్నారు. కావున ఉద్యోగులు, నిరుద్యోగులు ఐక్యంగా అధికార పార్టీ ప్రతిపాదించిన అభ్యర్థులను చిత్తుగా ఓడించి టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ బసంత్‌కుమార్, ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్

## పకడ్బందీగా టెన్త్, ఇంటర్ పరీక్షలు : కలెక్టర్

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి తగిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి కలెక్టర్ బసంత్‌కుమార్ వివరించారు. శనివారం రాష్ట్రంలోని కలెక్టర్లు, ఎస్‌పితో విజయవాడ నుంచి జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్‌రెడ్డి మాట్లాడుతూ మార్చి 15 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు, ఏప్రిల్ 3 నుంచి 18 వరకు పదవ తరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లను మూసి వేయించాలని, 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. సెల్‌ఫోన్లు తీసుకురాకుండా చర్యలు తీసుకోవాలని, వేసవి అయినందున తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని, ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. బస్సు సౌకర్యంతోపాటు జిల్లాకేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసుకోవాలని, 108 వాహనం అందుబాటులో ఉంచుకోవాలన్నారు. శాంతి భద్రతలు పటిష్ఠంగా అమలు చేయాలని ఆదేశించారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ బసంత్‌కుమార్ జిల్లాలో పరీక్షలు సజావుగా జరగడానికి జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని వివరించారు. జిల్లాలో మొత్తం 39 పరీక్ష కేంద్రాలకు ఇంటర్ మొదటి సంవత్సరం 9309 మంది, రెండవ సంవత్సరం 12,597 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి రాహుల్‌దేవ్‌సింగ్, ఇంటర్మీడియట్ ఆర్ఐఒ సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులను మోసం చేసిన సిఎం

**ప్రజాశక్తి-ధర్మవరం టౌన్**

ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు అనేక హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన సిఎం జగన్ నమ్మించి మోసం చేశారని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇర్షాద్, తెలుగు యువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుమలేశు విమర్శించారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరులు సమావేశంలో వారు మాట్లాడుతూ సోమవారం జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డికి ప్రతి నిరుద్యోగి ఆలోచించి ఓటువేసి వైసిపి బుద్ధి చెప్పాలన్నారు. సిపిఎస్ రద్దు ఏమైందని, డీఎస్సీ, నిరుద్యోగులకు ఉపాధి నిరుద్యోగభతి హామీలన్నీ ఎక్కడ వెళ్లాయని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ రూరల్ నాయకులు అశోక్, నాయకులు బొగ్గు వినోద్, ఎస్టీకేహరి, చిన్నూరు నారాయణస్వామి, నాగరాజు, రామకృష్ణ, తారకరామాపురం వినోద్, రమేశ్, ముత్యాలు, వెంకీ, తదితరులు పాల్గొన్నారు.

## ఖాద్రీశుడి రథోత్సవానికి పటిష్ట బందోబస్తు : ఎస్పీ

**ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్**

పట్టణంలో ఈనెల 13వ తేదీన సోమవారం నిర్వహించనున్న లక్ష్మీనసింహస్వామి రథోత్సవానికి (తేరు) పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ శనివారం ఒక ప్రటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముగ్గురు డీఎస్పీలు, 10 మంది సీఐలు, 15 మంది ఎస్ఐలు, 210 మంది సివిల్ కానిస్టేబుళ్లు, 90 మంది ఎఆర్ కానిస్టేబుళ్లు, 100 మంది హోంగార్డులు, ఏపీఎస్పీ ఒక ప్లటూన్ (26మంది)తో పటిష్ట భద్రత ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

# నేరాలు ఘోరాలు

## ఈతకెళ్లి బాలుడు మృతి

లోకేష్ మృతదేహాన్ని బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

**అగళి :** మండలంలోని మధూడి గ్రామం పరిధిలో ఉన్న సువర్ణముఖి కాలువలో ఈతకెళ్లి బాలుడు మృతిచెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ లావణ్య తెలిపిన వివరాల మేరకు... లోకేష్ (15) తన స్నేహితులు మను, హర్ష, ధనుతో కలిసి శనివారం మధ్యాహ్నం సువర్ణముఖి కాలువలోకి ఈతకు వెళ్లారు. ఇందులో భాగంగా నీటిలో పల్టీలు కొట్టారు. దీంతో లోకేష్ నీటి మునిగి బయటకు రాలేదు. భయపడిన స్నేహితులు ఇళ్లకు పరుగులు తీసి స్థానికులకు తెలిపారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు హుటాహుటిన కాలువ దగ్గరకు చేరుకుని పరిశీలించారు. కనిపించకపోవడంతో వెంటనే ఎస్ఐ లావణ్యకు సమాచారం అందించారు. ఆమె ఘటన స్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బందితో దాదాపు మూడు గంటలపాటు వెతికారు. చివరకు ముళ్లల్లో ఇరుక్కుపోయిన శవాన్ని బయటికి తీశారు. మృతదేహాన్ని చూసిన తల్లి సాకమ్మ, కుటుంబీకులు దు:ఖసాగరంలో మునిగిపోయారు. లోకేష్ తండ్రి భీమరాజు గతేడాది కరోనా సయమంలో మృతిచెందగా, ఇప్పుడు కుమారుడు మృత్యువాత పడటంతో సాకమ్మను ఓదార్చడం ఎవరితరం కాలేదు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మడకశిరకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**కొత్తచెరువు :** మండల పరిధిలోని లోచర్ల గ్రామ సమీపంలో ఉన్న మరువ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొత్తచెరువుకు చెందిన షౌకత్ కుమారుడు జబీవుల్లా (19) తన ఇద్దరు మిత్రులతో కలిసి మోటార్ సైకిల్‌లో లోచర్లకి వెళ్తుండగా మరువ వద్దకు రాగానే ముందు కట్టెలతో వెళ్తున్న ఆటోను ఢీకొన్నారు. దీంతో జబీబుల్లా అక్కడికక్కడే మృతి చెందాడు. మరొక యువకుడు మారుతీకి తీవ్రగాయాలు కావడంతో 108 ద్వారా ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ లింగన్న ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## అగ్ని ప్రమాదంలో మొక్కజొన్న దగ్ధం

మంటలు అర్పుతున్న పోలీసులు, స్థానికులు

**రొద్దం :** మండల కేంద్రంలోని వైఎస్ఆర్ సర్కిల్‌లో ఉన్న బిఎస్ఎన్ఎల్ టవర్ వద్ద బజ్జిల వ్యాపారి కాంతు తిను బండరాలు తయారు కోసం తెచ్చుకొన్న మొక్కజొన్న కంకి ఆడించిన తర్వాత వచ్చే కడ్లు శనివారం ప్రమాదవశాత్తు నిప్పుంటుకుంది. దీంతో దట్టమైన పొగరావడంతో చుట్టుపక్కల వారు, బిఎస్ఎన్ఎల్ సిబ్బంది గమనించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు జమేదార్ కాంతప్ప, పోలీసులు శివకుమార్, తదితరులు ఆర్పేందుకు యత్నించారు. అయినా అదుపులోకి రాకపోవడంతో ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు.

## విద్యుత్ వైర్లు తగిలి ఆవు మృతి

**రొద్దం :** మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు కురుబ రామాంజినప్పకు చెందిన ఆవుకు శనివారం విద్యుత్ వైర్లు తగిలి మృతిచెందింది. రామాంజినప్ప రెడ్డిపల్లి చెరువు కట్ట కింద సమీపంలోకి ఆవును మేతకు తీసుకెళ్లాడు. అయితే అప్పటికే ప్రమాదశాత్తు 11 కెవి విద్యుత్ వైరు కింద పడింది. గమనించని రైతు ఆవును చెరువు కట్ట కిందకు మేతకు తీసుకెళ్లగా ఆవుకు విద్యుత్ వైర్లను తగిలింది. దీంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. దీనివిలువ దాదాపు రూ.60వేలు ఉంటుందని రైతు వాపోయాడు. విషయం తెలుసుకున్న పెనుకొండ ఎడి కరుణాకరణ్, రొద్దం ఎఇ కృష్ణమూర్తి ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధిత రైతుకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

## ఆంగ్ల అధ్యాపకుడు సస్పెండ్

**ప్రజాశక్తి-ధర్మవరం టౌన్**

స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో పనిచేస్తున్న ఇంగ్లీష్ అధ్యాపకుడు ప్రభాకర్‌ను సస్పెండ్ చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారంరోజుల క్రితం ఆంగ్ల అధ్యాపకుడు ప్రభాకర్ అదే కళాశాలలో చదువుతున్న ఫైనలియర్ విద్యార్థిని పట్ల ఫోన్లో అసభ్యకరంగా మాట్లాడిన ఆడియో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. దీంతో విద్యార్థిని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు కళాశాల వద్ద ధర్నా చేపట్టారు. దీంతో డైరెక్టర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అధికారిణి నాగమణి ఉత్తర్వుల మేరకు ఆ అధ్యాపకుడు ప్రభాకర్‌ను సస్పెండ్ చేశామని ప్రిన్సిపాల్ తెలిపారు.

## తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి : ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

**ప్రజాశక్తి-కదిరి అర్బన్**

విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చి ఉన్నత శిఖరానికి చేరుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని గట్లు సమీపంలో ఉన్న బ్రాహ్మణపల్లి రోడ్డులో కరస్పాండెంట్ శ్రీనివాసులునాయక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నమాచార్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల నాల్గవ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా పాఠశాల యాజమాన్యానికి, సిబ్బందికి, విద్యార్థులు, తల్లిదండ్రులకు వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. నాలుగు సంవత్సరాల నుంచి గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులకు ఉన్నత విద్యను అందజేస్తూ మంచి సేవలు అందజేస్తున్న పాఠశాల యజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## 13న ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక సెలవు

**పుట్టపర్తి అర్బన్ :** ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా ఈనెల 13న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సోమవారం సెలవు దినంగా ప్రభుత్వం ప్రకటించినట్లు కలెక్టర్ బసంత్‌కుమార్ శనివారం ఒక ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగులు తమ ఓటుహక్కు వినియోగించుకునే నిమిత్తం కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సెలవు ప్రకటించినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక సెలవును క్యాజువల్ లీవ్‌గా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు.

## గుడిబండ పిహెచ్‌సి తనిఖీ

**ప్రజాశక్తి-గుడిబండ**

మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఒ మంజువాణి శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పలు రికార్డులను పరిశీలించి రోజువారి రోగుల వివరాలు, పిహెచ్‌సిలో సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిహెచ్‌సికి వచ్చిన రోగుల పట్ల అశ్రద్ధ వహించకుండా మందులు పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్‌నర్సులు, ఎఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.